cell :98663345657
PMR BUILDING PLANNER
PLAN TODAY BUILD TOMORROW
House Planning | Building Permission | HMDA & DTCP Layout Permission
Estimation | Home Loans | Valuations | Construction Drawings
HOUSE PLANNING · BUILDING PERMISSION · HMDA & DTCP LAYOUT PERMISSION · ESTIMATION · HOME LOANS · CONSTRUCTION DRAWINGS
Smart Plans... Stronger Structures... Better Tomorrow...


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190


నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను
నూతనంగా వెలువడుతున్న నేటి దిక్సూచి తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో క్రింద తెలుపబడిన కాటగిరిలలో విలేకరులు కావలెను.
• జిల్లా బ్యూరో లు
• జిల్లా ఇంచార్జి లు
• నియోజకవర్గ రిపోర్టర్లు
• మండల రిపోర్టర్లు
ఆసక్తి గలవారు క్రింది నంబరును సంప్రదించండి
Call : 9100900931

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :143 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ శనివారం- 19 - సెప్టెంబర్ - 2026



## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు.. కొత్త రూల్స్‌తో షాక్!

చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి

పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు

జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం

నిబంధనలపై హెచ్ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన

విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు

2లో

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్.. ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?



ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం

'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం

ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన

యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

2లో



2లో

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్

- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి



2లో

- గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి
- రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
- వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి
- నాని కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ
- లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అంజలి

# వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి.. మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

## వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు

- మోదీ పాలనను వివరిస్తూ 'VKS' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో మిగతా 2 లో



2లో

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం

మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం

పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన

మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్

# రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

## రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన

- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మిగతా 2 లో

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ

సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన




హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.

# తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

## తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

- ★ సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు
- ★ ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి
- ★ రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి



హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మిగతా 2 లో



2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

## 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు.. కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు



2లో

- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి
- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్
- ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల పెరుగుదల కనిపిస్తోందన్న మంత్రి
- బీఆర్ఎస్ పాలనలో ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీత

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం
## కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్‌గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
## రంగంలోకి రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

### తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..
## ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించిన పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

### 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
## కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను గతంలో ఎక్స్‌లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయా? అని నిలదీశారు. అయితే ఇవన్నీ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణను పొంగులేటి తన పోస్టులో వెల్లడించలేదు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడ బెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. కేసీఆర్‌కు పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడ విట్‌లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా? అని కేటీఆర్‌ను పొంగులేటి నిలదీశారు.

### మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..
## ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (ఫ్రీమో) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

మొదటి పేజి తరువాయి

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే" గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్? స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం. రూ. 38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశాం. ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు. మా లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

## వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి.. 'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్... వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

'VKS' మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'ఎఖా' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "ఎ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, ఖ అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ా అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'ఎఖా' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.

ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

### ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

అమరావతి: ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

### రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
## మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల,సెప్టెంబర్ 18, 2026: ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ రాఘవేంద్ర తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులముల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో గల జి. పి. కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన హియరింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో స్పష్టంగా ఉండేలా జాబితా రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ నుంచి 60 మంది కాంగ్రెస్‌లో చేరిక



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం ప్రవీణ్, డక్కలి సంఘం జిల్లా అధ్యక్షుడు జడల శంకర్ నేతృత్వంలో సుమారు 60 మంది యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దండే విఠల్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సిర్పూర్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతున్నా పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని చేరిన వారు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ విధానాల పట్ల ఆకర్షితులై చేరినట్లు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, సీతక్కలకు కీలక బాధ్యతలు కల్పించడం ద్వారా కాంగ్రెస్ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తోందని, బడుగు బలహీన వర్గాలకు పార్టీ పెద్దపీట వేస్తుందనే నమ్మకంతోనే చేరినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు, వార్డు సభ్యుడు ముక్రం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# చింతలమానపల్లిలో రూ.1.50 లక్షల విలువైన పట్టిక పట్టివేత



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18:చింతలమానపల్లి మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ.1,50,000 విలువైన 15 క్వింటాళ్ల పట్టికను పట్టుకున్నారు. కోర్సిని గ్రామానికి చెందిన తోడేటి రాజేష్ మహారాష్ట్రలోని ఆహేర్ నుంచి బొలెరో వాహనంలో ఈ పట్టికను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లంబడి హట్టి గ్రామానికి చెందిన శ్యామ్ లాల్ సూచనల మేరకు పట్టికను తీసుకువచ్చినట్లు, మండలంలోని వివిధ గ్రామాల్లో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. పోలీసులు వాహనం, పట్టికను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసును చింతలమానపల్లి ఎస్సై కమలాకర్ యం పర్యవేక్షిస్తున్నారు.

# లోనవెల్లిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం లోనవెల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటి, మండల వ్యవసాయ అధికారి భూక్య గిరీషన్ పాల్గొని రైతులకు సాగు వివరాలు వివరించారు. బోరు లేదా నీటి సౌకర్యం ఉన్న రైతులకు ఆయిల్ పామ్ సాగు మంచి అవకాశమని అధికారులు తెలిపారు.ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై 2535 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం అందిస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాల గర్భకాలంలో ఇంటర్ క్రాప్ సాగు చేసుకోవచ్చు. ఈ కాలంలో ఎకరాకు ఏటా ₹4,200 నిర్వహణ, ఇంటర్ క్రాప్ ఖర్చుల కోసం ప్రభుత్వం సహాయం అందిస్తుంది. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు కూడా సమకూరుస్తారు. ఎకరాకు 57 మొక్కలు నాటే ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీ లభిస్తుంది. తెలంగాణ ఆయిల్ పామ్ మిషన్ కింద అర్హులైన రైతులు ఈ దీర్ఘకాలిక పంట సాగుకు ముందుకు రావాలని, పూర్తి సాంకేతిక సహాయం అందిస్తామని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో లోనవెల్లి గ్రామ సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ సతీష్, వ్యవసాయ విస్తరణ అధికారులు రవికుమార్, విశాల్, శంకర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెంపల్లి, అచెల్లి, రుద్రారంలో చేయూత పెన్షన్ లబ్ధిదారుల నమోదు




ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: సిర్పూర్ టి మండలంలోని వెంపల్లి, అచెల్లి, రుద్రారం గ్రామాల్లో చేయూత పెన్షన్ లబ్ధిదారుల డాక్యుమెంట్లు పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. అనంతరం అచెల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య, కార్యదర్శులు ప్రవీన్ కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# టీజేఏలో సందీప్‌కు కీలక బాధ్యతలు



ఆసిఫాబాద్,సెప్టెంబర్ 18 ఆసిఫాబాద్ జిల్లా, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీలో ఒడ్నాల సందీప్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నిక సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఒడ్నాల సందీప్‌ను నియమించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు పార్వతి సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లాలోని జర్నలిస్టులతో సమన్వయం చేసుకుంటానని ఒడ్నాల సందీప్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీజేఏ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పోచంలొద్ది ఆశ్రమ పాఠశాలలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ తనిఖీ



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పోచంలొద్ది ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, తరగతి గదుల బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆహారం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యార్థినులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీతో పాఠశాల నిర్వహణపై మరింత బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెదురు వస్తువుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

## కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వెదురుతో తయారుచేసిన వస్తువుల వినియోగం ద్వారా కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వెదురు పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, మేదరులు తయారుచేసే వెదురు వస్తువులను కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. మేదర కులస్తులు నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తామని, అర్హులైన మేదర కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వెదురు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా మేదరులు తయారుచేసిన వస్తువులను కలెక్టర్ పరిశీలించగా, వెదురుతో చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను ఆమెకు అందజేశారు.

# రీ సర్వేతో రైతులకు మరింత ప్రయోజనం

## అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. శుక్రవారం కౌటాల మండలం బారేపల్లి గ్రామ శివారులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా భూ కొలతల అధికారి వినయ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నక్షాలు లేని గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో రైతుల మధ్య గట్ల తగాదాలు తలెత్తవని అదనపు కలెక్టర్ వివరించారు. రికార్డుల్లో ఉన్నట్టుగానే రైతుల భూమి విస్తీర్ణం నమోదవుతుందని, భూ తగాదాలకు ఆస్కారం లేకుండా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కౌటాలలో పౌల్ట్రీ శిక్షణతో గ్రామీణ జీవనోపాధికి ప్రోత్సాహం




ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు మూడు రోజుల పాటు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ఫార్మింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో ఈ శిక్షణ జరిగింది. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ పెంపకం ప్రాముఖ్యత, గ్రామీణ జీవనోపాధి అవకాశాలు, మెరుగైన కోళ్ల రకాలు, దాణా, ఆరోగ్య సంరక్షణ, సాధారణ నిర్వహణ పద్ధతులపై నిపుణులు రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పిఈఎస్ ఫామ్‌ను సందర్శించి వివిధ కోళ్ల జాతులు, మెరుగైన రకాలను రైతులు ప్రత్యక్షంగా పరిశీలించారు. మూడు రోజుల శిక్షణ పూర్తి చేసిన రైతులకు ధ్రువపత్రాలు అందజేశారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా రైతులకు అదనపు ఆదాయం, గ్రామీణ స్థాయిలో స్థిరమైన జీవనోపాధి అవకాశాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ బి. ప్రతాప్, ప్రోగ్రామ్ అసోసియేట్ గోండ్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘం పటేల్స్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కాగజ్‌నగర్ మండలం తెలంగాణలోని మున్నూరుకాపులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్యతను పెంపొందించేందుకు కుటుంబ సభ్యత్వం నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌తో పాటు ఆసిఫాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్‌తో కలిసి ఆయన వెబ్‌సైట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆసిఫాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు గాజుల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదారి సాయి (గోలేటి), కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు మేడిపల్లి రవి, వైస్ ప్రెసిడెంట్ పేరుక మహేష్, మండల యూత్ అధ్యక్షుడు పార్వతి సురేష్, ఉపాధ్యక్షుడు డెక్కపురి గోపాల్, పట్టణ అధ్యక్షుడు చిట్టంపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి పూదారి సాయి, కోశాధికారి పుల్లిశెట్టి వెంకటేష్‌లకు పదవులు అందజేశారు.

# మల్లెగూడలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్ మండలం మల్లెగూడ గ్రామంలో ఉప సర్పంచ్ రాజుతో పాటు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారికి శ్యామ్ నాయక్ స్వాగతం పలికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెగూడ బీఎల్ఏ దిలీప్, జీవన్, సూర్యకాంత్, యోగిరాజ్, బాలేష్ రావు, వినోద్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడికి భరోసా కల్పించిన జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 18: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కుమారుడు పోషణ, బాగోగులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాగజ్‌నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు మల్లయ్యను జిల్లా కలెక్టర్ కె.హరిత శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో స్వయంగా కలిశారు. సమస్యను విని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

# భూగర్భ జలాలను సంరక్షించాలి

## భూగర్భ జలాల శాస్త్రవేత్త రాంబాబు



జైపూర్,సెప్టెంబర్ 18: జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంజిఎన్ఆర్జిఎస్/విబిజి రాంజీ పథకాల ద్వారా చేపడుతున్న భూగర్భ జల సంరక్ష పనులను సెంట్రల్ భూగర్భ శాఖ శాస్త్రవేత్త అయిన రాంబాబు సందర్శించి పరిశీలించారు.గ్రామంలో వివిధ రకాలుగా భూగర్భ జలాలను సంరక్షించే విధానంను ప్రశంసిస్తూ మరింతగా ఫారం పాండ్,పార్కులేషన్ ట్యాంక్ లు,ఇంకుడు గుంతలు,ట్రెంచ్లు నిర్మాణం చేపట్టాలని, ప్రతినిత్యం భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని,భవిష్యత్తు తరాలకు నీరు అందించే దిశగా జాగ్రత్తలు వహించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపూరావు,స్థానిక సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్,ఉప సర్పంచ్ ఎల్కటూరి శివ,ఏపీడి శ్రీనివాస్,ఏపీఓ బాలయ్య,ఈసీ రాజమౌళి,సదానందం ఏపీడి,పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్,టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి,ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్ పాల్గొన్నారు.

# నానో ఎరువులతో తక్కువ ఖర్చుతో వ్యవసాయం

## మండల వ్యవసాయ అధికారిణి సయ్యదా ఖుద్సియా



జైపూర్, సెప్టెంబర్ 18,: నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా ఎరువుల సామర్థ్యాన్ని పెంచి సాగు ఖర్చులను తగ్గించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి సయ్యదా ఖుద్సియా అన్నారు.జైపూర్ మండలంలో క్లైమేట్ స్మార్ట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నానో ఎరువుల వినియోగ సాంకేతికత -సమర్థవంతమైన పోషక యాజమాన్యం అనే అంశంపై రైతులకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు నానో యూరియా,నానో డీఏపీ వినియోగ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.పంట దశను బట్టి నానో ఎరువులను ఎలా పిచికారీ చేయాలి,ఎంత మోతాదులో వాడాలి,పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు ప్రత్యక్షంగా వివరించారు.నానో ఎరువులను సిఫార్సు చేసిన పంటలలో,సూచించిన పంట దశలో,లేబుల్‌పై పేర్కొన్న మోతాదు ప్రకారమే వాడాలని సూచించారు.పిచికారీకి శుభ్రమైన నీటిని ఉపయోగించాలని,ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని తెలిపారు.ఇతర పురుగుమందులు,ఎరువులతో కలిపి వాడే ముందు అనుకూలతను నిర్ధారించుకోవాలని సూచించారు.నానో ఎరువుల వినియోగంతో సమతుల్య పోషక యాజమాన్యం,ఎరువుల సమర్థవంతమైన వినియోగం సాధ్యమై స్థిరమైన వ్యవసాయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.క్షేత్ర ప్రదర్శన ద్వారా రైతులకు నానో ఎరువులపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఏ.స్రవంతి,కృషి సఖీలు సింధూజ,శైలజ,సర్పంచ్ తో పాటు పలువురు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



రెబ్బెన సెప్టెంబర్ 18 : క్రీడా పోటీల ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం కె. రాజమల్లు అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 93వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో ఎస్ఓటు జీఎం జట్టు, ఖైరిగూడ ప్రాజెక్ట్ అధికారి జట్ల మధ్య జరిగిన డిపార్ట్‌మెంటల్ హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కె. రాజమల్లు మాట్లాడుతూ ఉద్యోగ క్రీడాకారులు సమిష్టిగా పోటీల్లో పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల సాధనతో ఒత్తిడి తగ్గడంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. గతంలో పతకాలు సాధించిన సీనియర్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ ఎస్.కె. అబ్బాస్, ఏఐటీయూసీ నాయకుడు మారం శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# టేకుమట్లలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం



జైపూర్,సెప్టెంబర్ 18,: జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీలో శుక్రవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు వ్యాసరచన పోటీలు, నినాదాలు, నాలుగు రకాలుగా చెత్త సేకరణ,ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటడం గురించి క్లుప్తంగా వివరించారు.అలాగే పాఠశాలలో,అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు.అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలను నమోదును స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్,ఉపసర్పంచ్ గోనె ప్రవీణ్,వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నెహ్రూ యూత్ గణేష్ మండపంలో ఘనంగా కుంకుమార్చన పూజలు..



మందమర్రి, , సెప్టెంబర్ 18.. మందమర్రి స్థానిక నెహ్రూ యూత్ గణేష్ మండపం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, గణనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. లోక కళ్యాణార్థం, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుతూ మహిళలంతా ఏకతాటిపై వేద మంత్రోచ్చారణల నడుమ కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో నెహ్రూ యూత్ కమిటీ నిర్వాహకులు, స్థానిక కాలనీవాసులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

# బైక్ బజార్లలో బరితెగింపు?

పాత బైక్‌లకు కొత్త మేకప్.. ఫైనాన్స్ పేరుతో వడ్డీ వాత

ఈఎంఐ ఆలస్యమైతే రోడ్డుపైనే సీజింగ్ హంగామా!

'సెటిల్మెంట్' ముసుగులో వాహనదారుల నష్టమంటూ ఆరోపణలు








ఎల్బీనగర్/నేటి దిక్సూచి: చేతిలో తక్కువ డబ్బు.. అవసరానికి బైక్.. ఇదే ఆసరాగా కొన్ని బైక్ బజార్లు, అనుబంధ ఫైనాన్స్ వ్యవహారాల్లో సామాన్య వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. పాత వాహనాలకు మరమ్మతులు, రంగులు వేసి కొత్తవాటిలా విక్రయిస్తున్నారనే విమర్శలతో పాటు, ఫైనాన్స్‌లో అధిక వడ్డీలు, వాయిదాలు ఆలస్యమైతే ఒత్తిళ్లు, రోడ్డుపైనే వాహనాల స్వాధీనం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక 'సెటిల్మెంట్' పేరుతో మరో వ్యవహారం నడుస్తోందని కొందరు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వాహనం విలువ, ఇప్పటికే చెల్లించిన వాయిదాలు, బకాయిల లెక్కలను స్పష్టంగా చూపకుండా తక్కువ మొత్తానికే వాహనాన్ని తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అసలు బైక్ విలువ ఎంత? వినియోగదారుడు ఇప్పటికే ఎంత చెల్లించాడు? చివరికి ఎంత మొత్తానికి లెక్క తేల్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## రోడ్డుపైనే వాహనాల స్వాధీనం.. నిబంధనలు ఏమంటున్నాయి?

వాయిదా బకాయి పేరుతో గుంపులుగా వచ్చి వాహనదారులను అడ్డుకోవడం, బలవంతంగా బైక్‌లు తీసుకెళ్లడం వంటి ఘటనలు నిజమైతే వాటిపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. చట్టబద్ధమైన రికవరీ విధానాలను పాటిస్తున్నారా? వాహన స్వాధీనం సమయంలో వినియోగదారుల హక్కులను గౌరవిస్తున్నారా? అన్నది పరిశీలించాల్సి ఉంది. బైక్ బజార్లు ఫైనాన్స్ సంస్థల మధ్య ఉన్న సంబంధాలు, వాహనాల విక్రయ పద్ధతులు, వడ్డీఛార్జీలు, సీజింగ్ విధానం, సెటిల్మెంట్ లెక్కలపై సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు చేపడితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆరోపణలు వాస్తవమైతే చర్యలు.. నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి కోల్పోతుందా? నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచే మార్గాలు ఇవేనట!

నాడులను శాంత పరచుకోవడానికి మార్గాలున్నాయట

వాటిని ట్రై చేస్తే మేలు జరుగుతుందని నిపుణుల సూచన!



ఒత్తిడి తీవ్రమైతే నాడీ వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. దీంతో మనసు ఉద్రిక్తంగా మారుతుంది. శరీరం విశ్రాంతిని కోల్పోతుంది. ఈ క్రమంలో నాడుల స్పందనను నెమ్మదింపజేయడానికి ఎన్నో పరిష్కారాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

### ఆలోచనల నుంచి వర్తమానంలోకి :

ఒత్తిడి, ఆందోళన తరచూ శరీరంలో మొదలవుతుంది కానీ, మనసులో కాదు. ఇది నాడీ వ్యవస్థను శాంతపరచడం ద్వారా జరుగుతుంది. కాబట్టి, మన ఆలోచనల్ని దానిపై మళ్లించడం, శ్వాసను గమనించాలి. అలాగే, నేలపై మన పాదాలను అనుభూతి చెందడం, చుట్టూ ఉన్న పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి. ఇది మిమ్మల్ని ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, వర్తమానంలోకి తీసుకురావడానికి సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా, ఒత్తిడి తగ్గుతుందంటున్నారు.

### మానసిక స్థితిని అర్థం చేసుకోవడం :

నాడీ వ్యవస్థ ఎప్పుడు ఉత్తేజితమవుతుందో మొట్టమొదట గుర్తించాలి. 'ఇప్పుడు నా శరీరంలో ఏం జరుగుతోంది? నేను కోపంగా, అశాంతితో లేదా ఆందోళనగా ఉన్నానా? అని మనల్ని మనం ఆత్మావలోకనం చేసుకోవాలి. ఇలా చేస్తే ప్రతిచర్య, ప్రతిస్పందన మధ్య ఓ విరామాన్ని సృష్టించి ఒత్తిడిని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు

### వేగాన్ని తగ్గించుకోవడం :

ఒత్తిడి, ఆందోళన అత్యవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతి పని ముఖ్యమైనదిగా అనిపిస్తుందట. మన నాడీ వ్యవస్థ వేగానికి ప్రతిస్పందిస్తుంది. కాబట్టి, కదలికలు, మాటలు, శ్వాసను నెమ్మదిగా చేయడం ద్వారా మనం సురక్షితంగా ఉన్నామని శరీరానికి సంకేతం పంపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మనం తరచూ ఒత్తిడి, ఆందోళనకు గురైనట్లు లేదా విశ్రాంతి లేనట్లుగా కనిపిస్తే, ఈ స్థితిలో ఎక్కువ సేపు గడిపామని దానర్థం. ఇలాంటప్పుడు ఒత్తిడి, ఆందోళన ఎక్కడ మొదలైందో ఆలోచించాలి. నాడీవ్యవస్థ స్తంభించడానికి కారణాలను తెలుసుకోవాలి. నాడీవ్యవస్థను నియంత్రించుకోవాలి. అంటే, మన శరీరం ప్రశాంతంగా ఉండటానికి తగినంత సురక్షితంగా భావించేలా సహాయపడాలి. - ఒవెన్ ఓ కెన్, బ్రిటన్?కు చెందిన సుప్రసిద్ధ మనోవైద్య నిపుణుడు

### అంతర్గత సంఘర్షణకు చెక్ :

ఒత్తిడి భావనను ప్రతిఘటించడానికి బదులుగా దాన్ని అనుమతించాలట. మన భావాలతో పోరాడినప్పుడు మరో పొర ఉద్రిక్తతను జోడించినట్లు లెక్క. ఆందోళనకు అడ్డుపడకుండా ఉండే అది అంతర్గత సంఘర్షణను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ కుదుటపడటానికి సహాయపడుతుందని అంటున్నారు.

### బ్రేక్ తీసుకోవడం :

ఒత్తిడి వలయంను ముందుగానే నిలువరించాలట. మనం తీసుకునే చిన్న బ్రేక్ కూడా ఈ వలయం తీవ్రం కాకుండా ఆపగలదు. ఈ క్రమంలో ఒత్తిడి సంకేతాలను ఎంత ముందుగా గమనిస్తే, స్పందన అంత సులవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

### రోజువారీ అలవాట్లలో మార్పులు :

రోజులో సురక్షితమైన క్షణాలను సృష్టించుకోండి. మన నాడీవ్యవస్థ నిరంతరం సంకేతాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఏ విధమైన ఆటంకాలు లేకుండా కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం, కొద్దిసేపు నడవడం, నిరంతర సమాచార ప్రసారానికి దూరంగా ఉండటం క్రమం తప్పకుండా చేసినప్పుడు, చిన్న విరామాలు కూడా ఆందోళన నుంచి ఉపశమనానికి తోడ్పడతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఒత్తిడిలో ఓ సాధారణ ధోరణ ఏమిటంటే, మనం అనుకున్న రీతిలో దాన్ని పరిష్కరించాలనుకోవడం. కానీ ఇది తరచుగా మరింత ఒత్తిడిని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ఆందోళన అనేది మానవ సహజమని, దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు.

### శరీరం సహజ ప్రతిస్పందన :

ముప్పును పసిగట్టినపుడు శరీరం సహజంగానే పోరాటమైనా చేస్తుంది లేదా పలాయన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ సమయంలో వేగవంతమైన శ్వాస, కండరాలు బిగువుగా మారడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అప్రమత్తం కావడం లాంటివి ఉండొచ్చంటున్నారు నిపుణులు. ఇవన్నీ మనల్ని మనం రక్షించుకోవడానికి ఉద్దేశించినవట. కానీ, మన నాడీ వ్యవస్థ వాస్తవ ప్రమాదానికి, ఆందోళనకరమైన ఆలోచనలకు మధ్య తేడాను ఎల్లప్పుడూ గుర్తించదు. కాబట్టి, రోజువారీ ఒత్తిడి కూడా పోరాటం లేదా పలాయనం ప్రతిస్పందనను ప్రేరేపించొచ్చట. మనం పోరాటం లేదా పలాయన స్థితిలో చిక్కుకుపోయినట్లు భావిస్తే, దాని నుంచి బలవంతంగా బయటకు రావడం లక్ష్యం కాకూడదని నిపుణులు చెబుతున్నారు. దానికి బదులుగా, శరీరానికి సున్నితంగా భద్రతా సంకేతాలు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

### పరిశోధన మూలాలు :

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# కడుపుబ్బరంగా అనిపిస్తోందా సహజసిద్ధ పరిష్కారాలు ఇవేనట!

జీర్ణ సమస్యల నియంత్రణకు ఇవి ట్రై చేస్తే బెటర్

అంటున్న నిపుణులు



ఇష్టమైన ఆహారం ఎక్కువగా తిన్నా, మలబద్ధకం ఉన్నా, కడుపులో గ్యాస్ ఏర్పడినా, నీళ్లు ఎక్కువగా తాగినా.. ఇలా పలు సందర్భాల్లో కడుపు ఉబ్బరంగా అనిపించడం మామూలే! దీంతో తలెత్తే అసౌకర్యం వల్ల ఇతర పనులపై దృష్టి పెట్టలేం. అయితే, ఈ సమస్యను తగ్గించుకోవాలంటే కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

### ఫైబర్ ఎక్కువగా తీసుకోవాలి :

ఫైబర్, ద్రవాహారం తక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వంటివి మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ సమస్య వల్ల కడుపుబ్బరం రావచ్చని చెబుతున్నారు. అందుకే, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే, తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పప్పులు, నట్స్, గింజల్లో లాంటి వాటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుందని సలహా ఇస్తున్నారు. వీటితోపాటు ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. అలాగే, క్రమం తప్పకుండా వ్యాయాయం చేయాలని తెలియజేస్తున్నారు.

### గబగబా తినేస్తున్నారా? :

సమయం లేదనో, ఇతర కారణాల వల్ల కొంతమంది గబగబా భోజనం చేసేస్తుంటారు. కడుపులో గ్యాస్, ఉబ్బరానికి ఇది కూడా ఓ కారణమంటున్నారు నిపుణులు. ఎందుకంటే, ఇలా గబగబాగా తినడం వల్ల ఆహారంతోపాటు గాలి కూడా కడుపులోకి వెళ్లిపోతుందట. దీనివల్ల కడుపుబ్బరం వస్తుందని చెబుతున్నారు. అందుకే, భోజనానికి కనీసం అరగంటైనా కేటాయించాలని సూచిస్తున్నారు. అలాగే, ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినాలని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆహార పదార్థాల రుచిని ఆస్వాదించడంతో పాటు జీర్ణ వ్యవస్థ కూడా చురుగ్గా ఉంటుందని తెలియజేస్తున్నారు. అలాగే, ఎక్కువ ఆహారం తీసుకోకుండా జాగ్రత్తపడచ్చని పేర్కొంటున్నారు. వేగంగా తినడం వల్ల గాలిని మింగడం జరిగి, కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యానికి దారితీస్తుందని పేర్కొంది.

### వీటితో ఉపశమనం :

పెరుగు లేదా మజ్జిగ : కడుపులోని మంచి బ్యాక్టీరియా ఉబ్బరాన్ని తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు, మజ్జిగా వంటివి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలంటున్నారు.

### అల్లం టీ :

అల్లం కడుపులో యాసిడ్ స్థాయిని క్రమబద్ధీకరించడం ద్వారా అజీర్ణం, అసిడిటీ నుంచి ఉపశమనం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, గ్యాస్ట్రిక్ సమస్యలు, కడుపుబ్బరం వంటి సమస్యలను తగ్గించడానికి ఇది ఒక సహజ నివారణగా పనిచేస్తుందని చెబుతున్నారు. అల్లం ఎగువ జీర్ణశయాంతర లక్షణాలను మెరుగుపరుస్తుందని అధ్యయనం పేర్కొంది.

### పుదీనా టీ :

పుదీనాలో ఉండే మెంథాల్ జీర్ణవ్యవస్థ కండరాలను రిలాక్స్ చేయడంతో పాటు గ్యాస్?ను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ముఖ్యమైన నూనెలు కడుపు ఉబ్బరం, ఇరిటబుల్ బవెల్ సింక్రోమ్ లక్షణాలని తగ్గిస్తాయని అంటున్నారు. స్వల్పకాలిక జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి పెప్పర్‌మింట్ టీ విస్తృతంగా ఉపయోగిస్తారని పేర్కొంది.

### ప్రశాంతంగా నిద్రపోవడం :

రాత్రుళ్లు ఆలస్యంగా తినడం, అర్ధరాత్రి దాటాక పడుకోవడం వల్ల నిద్ర సరిపోదంటున్నారు నిపుణులు. తద్వారా తీసుకున్న అరక్కపోవడం, గ్యాస్, కడుపుబ్బరం వంటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. అందుకే త్వరగా తినడం, వేళకు పడుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది

# డి-స్టార్ట్ స్కాలర్‌షిప్ పరీక్షకు విద్యార్థులు సిద్ధం కావాలి

డి-స్టార్ట్ స్కాలర్‌షిప్ పరీక్షకు విద్యార్థులు సిద్ధం కావాలి

ఈ నెల 20న దీక్ష జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పరీక్ష

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముందుగానే స్కాలర్‌షిప్ అవకాశం



హైదరాబాద్, దిక్సూచి పదో తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడేలా దీక్ష జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన "డి-స్టార్ట్" స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్లు రాజు, ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష మంచి అవకాశంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. డి-స్టార్ట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పదో తరగతి నుంచే స్కాలర్‌షిప్ అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల చదువుకు కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర విద్యా సంస్థలతో పోలిస్తే పదో తరగతి నుంచే విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవకాశాన్ని కల్పించడం ఈ పరీక్ష ప్రత్యేకతగా నిలుస్తుందని వారు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పరీక్షకు హాజరై, ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్ పొందాలని రాజు, ప్రభాకర్ కోరారు. పదో తరగతి అనంతరం విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వారి భవిష్యత్ విద్యాభివృద్ధికి డి-స్టార్ట్ పరీక్ష దోహదపడుతుందని వారు ఆకాంక్షించారు.

# అక్రమ క్లినిక్‌లపై వైద్య శాఖ కొరడా

అక్రమ క్లినిక్‌లపై వైద్య శాఖ కొరడా

హఫీజ్‌పేట్, నార్సింగిలో రెండు క్లినిక్‌లు సీజ్

అనుమతులు లేకుండా రక్త పరీక్షలు.. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు

అక్రమ వైద్య కేంద్రాలపై తనిఖీలు కొనసాగుతాయన్న డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి






రంగారెడ్డి, సెప్టెంబర్ 11 (నేటి దిక్సూచి ): రంగారెడ్డి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, ప్రయోగశాలలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం డీఈఎంవో గంగాసాని మంజుల, శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. హఫీజ్‌పేట్, నార్సింగి ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెండు క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. హఫీజ్‌పేట్‌లోని రియా క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అనుమతులు లేకుండా వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత కేంద్రంపై చర్యలు తీసుకుని సీజ్ చేశారు. అదేవిధంగా నార్సింగిలోని ప్రియదర్శిని క్లినిక్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆ కేంద్రాన్ని కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే విధంగా అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ప్రయోగశాలలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో అక్రమ క్లినిక్‌లు, అక్రమ ప్రయోగశాలలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ఈ తనిఖీల్లో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మీకు కోపం ఎక్కువగా వస్తుందా?

# నిపుణులు చెప్తున్న టిప్స్ ఇవే!

మనిషికి కోపం రావడానికి కారణాలనేకం దీన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలుసా?

ఎదుటి వ్యక్తి ప్రవర్తన నచ్చకపోయినా, చెప్పిన పని చేయకపోయినా, మనతో దురుసుగా మాట్లాడినా, అవమానించినా, మన లక్ష్య సాధనలో విఫలమైనా కోపం రావొచ్చు. మనిషికి ఉండే ఏడు సార్వత్రిక భావోద్వేగాల్లో కోపం ఒకటని నిపుణులు చెబుతున్నారు. కోపం అనేది సమస్య కాదని, దాన్ని ఎలా నియంత్రిస్తాం, వ్యక్తపరుస్తాం అనే దానిలోనే అసలు సమస్య ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో కోపాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

### అలా ఎందుకు జరుగుతుంది? :

ఎవరి నుంచైనా ముప్పు పొంచి ఉందని తెలిసిన వెంటనే మనలోని ప్రమాద హెచ్చరిక వ్యవస్థ క్రియాశీలమవుతుందంటున్నారు నిపుణులు. అప్పుడు మన దృష్టి మొత్తం ఆ ముప్పుపై కేంద్రీకృతమవుతుందని చెబుతున్నారు. ప్రాణ రక్షణ స్థితిలో మన దేహం తీవ్రమైన కోపం, హింసాభావంతో నిండిపోతుందని పేర్కొంటున్నారు. మాములుగా ఆవేశం మన కడుపులో మొదలై, ముఖంపైకి వచ్చి, మనల్ని వికృతంగా ముఖం పెట్టేలా, పిడికిలి బిగించేలా చేస్తుందని పేర్కొంటున్నారు. అరుపు రూపంలో శరీరం నుంచి బయటికి వస్తుందని చెబుతున్నారు

### విపరిణామాలు తప్పవు :

స్వల్పకాలంలో కోపం శక్తివంతమైనదిగా, ప్రతిఫలదాయకంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా తాను కోరుకున్నది పొందుతానని భావించడం కొందరి క్షణికావేశానికి కారణమంటున్నారు. దీని విపరిణామాల మొదటి లక్షణం సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. చాలా సందర్భాల్లో బంధువులు, మిత్రులు దూరమైపోతారని తెలియజేస్తున్నారు. అది మనల్ని ఒంటరిగా చేస్తుందట. చాలామంది గాయపడతామనే భయంతో, తమను తాము రక్షించుకోలేమేమోనన్న అనుమానంతో, లేదా అన్యాయం జరుగుతుందేమోనన్న భయంతో స్పందిస్తారని వివరిస్తున్నారు.

### ఇదో రుగ్మత :

కోప రుగ్మతకు స్పష్టమైన నిర్ధారణ లేదట. కానీ, మానసిక వైద్య నిర్ధారణ మాన్యువల్?లో దీనిని 'ఇంటర్మిటెంట్ ఎక్స్?ప్లోసివ్ డిజార్డర్' అని చేర్చారు. ఇది దూకుడు ప్రేరణలను నియంత్రించడంలో వైఫల్యాన్ని సూచిస్తుందంటున్నారు నిపుణులు. పునరావృత ప్రవర్తనా విస్ఫోటనాల ద్వారా వ్యక్తమవుతూ ఉంటుందని చెబుతున్నారు. ఇది కుంగుబాటు, ఆందోళన, పోస్ట్-ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ మాదకద్రవ్యాల వినియోగ రుగ్మతలు, మరెన్నో విభిన్న మానసిక ఆరోగ్య సమస్యలలో కనిపిస్తుందని పేర్కొంటున్నారు. అంతే కాకుండా కోపం అనేది నిద్రలేమి సమస్యకూ దారి తీస్తుందని ఎర్కొంది. ఈ క్రమంలో అనవసరంగా కోపం వచ్చే వాళ్లకు కరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. కోపానికి కారణమయ్యే అంశాలను అంటే పరిసరాలు, వ్యక్తులను గుర్తించి దూరంగా ఉండాలంటున్నారు. భావోద్వేగాలను నియంత్రించుకోడానికి మొట్టమొదటి సూత్రం మనల్ని మనం సంభాళించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆ తర్వాత దాన్ని అధిగమించడానికి జ్ఞానం, బలం, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఉండాలని చెబుతున్నారు. శ్రమలేని, నెమ్మదైన యోగా లాంటి వ్యాయామాలు కండరాలను సడలించి, ప్రశాంతతను కలిగిస్తాయని పేర్కొంది. కోపాన్ని తగ్గించుకోవడానికి ఉపకరించే వ్యూహాన్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఇందులో శ్వాసను నెమ్మదింపజేయడం, ఊహాత్మక చిత్రాలు చూడటం, మన ఆలోచనలను విశ్లేషించడం, కొంత సమయం తీసుకుని పరిసరాలను మార్చుకోవడం లేదా విశ్రాంతి నైపుణ్యాలను ఉపయోగించడం వంటివి ఉండొచ్చని వివరిస్తున్నారు. మనస్తత్వవేత్తలు కోపానికి పలు థెరపీలు సూచిస్తున్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815